# దసరా శుభాకాంక్షల వెల్లువ

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బేగంపేట్, అక్టోబర్ 14: రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో పలువురు నాయకులు, అభిమానులు కలిసి శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువలతో, పూల మాలతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, లక్ష్మిపతి, వెంకటేషన్‌రాజు, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, నసీంభాను ఉన్నారు.



బన్సీలాల్‌పేట్: ఎమ్మెల్యే తలసానిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సన్మానిస్తున్న నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

## మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

దుండిగల్, అక్టోబర్14: మనస్థాపం, క్షణికావేశంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారెగూడం గ్రామంలో శ్రీశైలం (40), సౌజన్య దంపతులు నివాసముంటారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. మద్యానికి బానిసైన శ్రీశైలం తరచూ తాగి ఇంటికి వస్తుంటాడు. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చిన శ్రీశైలంకు భార్యతో గొడవ జరిగింది. దీంతో అతను ఇంటి మూడో అంతస్థు పైనుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని సూరారంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## విద్యుత్ తీగలపై పడిన మెటీరియల్ సప్లై మిల్లర్ లిఫ్ట్

కొండాపూర్, అక్టోబర్ 14 : కొండాపూర్‌లోని రాఘవేంద్రకాలనీలో సోమవారం ప్రమాదవశాత్తు మెటీరియల్ సప్లై మిల్లర్ లిఫ్ట్ 11కేవీ విద్యుత్ తీగలపై పడిపోవడంతో తీగలు తెగిపోయాయి. సంఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిర్మాణ పనులు సాగుతున్న భవనం ప్రక్కనే ఉన్న స్కూల్‌కు దసరా సెలవులు ఉండడంతో, కాలనీ రోడ్డుపై సైతం జనాలు లేకపోవడం వల్ల ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు వాపోయారు. లిఫ్ట్ పడిపోయిన భవనానికి సైతం అనుమతులు లేవంటూ, జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరు లేకపోవడంతో సమస్య ఏర్పడలేదని, లేదంటే ప్రాణ నష్టం జరిగేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సదరు నిర్మాణదారుడిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

## బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

అంబర్‌పేట, అక్టోబర్ 14 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజు అన్నారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో మధు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంద్‌తో మధ్యతరగతి విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకపక్క డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులు కట్టి ఎగ్జామ్స్‌కు విద్యార్థులు ప్రిపేర్ అవుతున్న వేళ డిగ్రీ కళాశాలలు బంద్ చేయడం దారుణమని అన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్, సహాయ కార్యదర్శులు గుర్రం అజయ్, నరసింహారెడ్డి, కోశాధికారి మామిడాల మహేశ్, కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, మాదారపు నాగరాజు, మామిడాల ప్రవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.




పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మధు

## తాగునీటి కోసం పోరుకు సిద్ధంకావాలి




బస్తీవాసులతో మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి:, అక్టోబర్ 14: కంటోన్మెంట్‌లో తాగునీటి కోసం రాష్ట్ర ప్రభుత్వంపై సమరం తప్పదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. సోమవారం ఆరో వార్డు పరిధిలోని మహాత్మాగాంధీనగర్ బస్తీలో పర్యటించి బస్తీలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. బస్తీవాసులు కంటోన్మెంట్‌లో సరిపడా మంచినీరు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా దున్నపోతు మీద వర్షం పడినట్టు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఇకపై కంటోన్మెంట్ వాసులంతా రాష్ట్ర ప్రభుత్వంపై పోరుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి బలం: ఎమ్మెల్యే గోపాల్



ఎమ్మెల్యే ముఠాగోపాల్, జయసింహకు పుష్పాభిషేకం చేస్తున్న శ్రీనివాస్, తదితరులు

చిక్కడపల్లి, అక్టోబర్ 14: కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే గోపాల్, బీఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహకు పుష్పాభిషేకం చేశారు. నాయకులు మహ్మద్ అలీ, రహీం, శంకర్‌గౌడ్, దస్తగిరి, సాయి, సునీల్, కల్యాణ్ తదితరలు పాల్గొన్నారు.

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



ఘటన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 14: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. దేవతా విగ్రహాలను ధ్వంసం చేయడం సమాజానికి మంచిది కాదని ఆమె పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఉపేక్షించకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు భక్తుల మనోభావాలు దెబ్బతీయడమే అవుతుందని అన్నారు.



బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 14: పద్మారావు నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు విజయ్ కుమార్ కొడుకు డెనిసన్ (25) సోమవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న బీజేపీ యువమోర్చా నాయకుడు మర్రి పురూరవరెడ్డి విజయ్‌కుమార్‌ను ఓదార్చారు. తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు.

## అమ్మవారి పల్లకీ సేవలో కార్పొరేటర్



అమ్మవారి పల్లకీ సేవలో పాల్గొన్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ తదితరులు

సికింద్రాబాద్, అక్టోబర్ 14: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పద్మారావునగర్ హమాలీబస్తీలో నల్ల పోచమ్మ అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. అంతకుముందు ఆమె అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నేరేటి రవికుమార్, భీమ్రాపు మల్లికార్జున్, గిరిబాబు, నరేశ్, ఆదయ్‌కిరణ్, ధనుశ్, దేవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ విద్యార్థులకు రూ.50వేల విరాళం



నగదును విద్యార్థికి అందజేస్తున్న మోహన్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 14: ఎల్బీనగర్ చిత్రాలేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల వసతులకు, చదువులకు మన్సూరాబాద్ విజయశ్రీ కాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా రూ.50వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మా నాన్నలు కోల్పోయి ఎలాంటి ఆధారం లేక అనాథ విద్యార్థి గృహంలో అవకాశం రావడం విద్యార్థుల అదృష్టమని, గృహ కమిటీ కల్పించిన అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని అహర్నిశలు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రజలకు కష్టాలు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అత్తాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ ఆధ్వర్యంలో కార్తీక్‌రెడ్డిపై రూపొందించిన పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి యువకుల మద్దతు రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజలు కష్టాలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్ర బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ మాట్లాడుతూ.. కార్తీక్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో పాటను రూపొందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాముయాదవ్, రఘు, అశోక్‌యాదవ్, శ్రీపాల్, వెంకటేశ్, శశికాంత్, దామోదర్, సంగీత్, రాజు తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారంలో ముందుంటాం



రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తలారి దినకరన్‌రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 14: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని ధర్మసేన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తలారి దినకరన్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మసేన ఫౌండేషన్ తరపున అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. కేసీఆర్ పలు సూచనలు చేశారని తెలిపారు.

## పెద్దమ్మగుడిలో సెల్‌ఫోన్లు చోరీ

బంజారాహిల్స్, అక్టోబర్ 14: జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధి పెద్దమ్మగుడిలో దసరా సందర్భంగా ఆలయంలో వాహనపూజకు వచ్చిన ఏఎస్ఐ కుటుంబసభ్యుల సెల్‌ఫోన్లను దుండగులు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయ.. బోరబండ ప్రాంతంలో నివాసముంటున్న డి.డిల్లేశ్వర్ రావు ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈనెల 12న దసరా పండుగ రోజున తన కొత్త కారుకు పూజ చేయించేందుకు కుటుంబసభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడికి వచ్చారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో వాహన పూజ నిర్వహిస్తున్న క్రమంలో భార్య, కుమార్తె సెల్‌ఫోన్లను కారు వెనుక సీట్లో పెట్టారు. పూజ అనంతరం బయల్దేరగా కారు వెనకసీట్లో పెట్టిన ఫోన్లు మాయమైన విషయాన్ని గుర్తించారు. వెంటనే బాధిత ఏఎస్ఐ డిల్లేశ్వర్‌రావు సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

## కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాలు




లోగోను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, అక్టోబర్ 14: కల్లుగీత కార్మిక సంఘం 67 వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో తెలంగాణ పదేండ్ల ప్రయాణం-కల్లుగీత వృత్తిలో ఉపాధి అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూత శ్రీకాంత్‌గౌడ్ హాజరు అవుతున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో గీత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య, నాయకులు కృష్ణస్వామి, బొయపల్లి సుధాకర్, లింగంగౌడ్, యాదయ్య, ప్రభాకర్, ఆంజనేయులు, నరసింహ్మా, శ్రీశైలం, తదితరలు పాల్గొన్నారు.

## ముగిసిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

- యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌లో 500 గృహాల్లో పూర్తయిన సర్వే



కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్న డీసీ జాకియా సుల్తానా, అధికారులు, సిబ్బంది

జూబ్లీహిల్స్,అక్టోబర్14 : ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయడంతో పాటు ఒక్క కార్డుతో అన్ని సేవలను అందించేందుకు చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పూర్తయింది. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జీహెచ్ఎంసీ అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహనగర్‌లో నిర్దేశిత 500 గృహాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. అన్ని సేవలను ఒకే కార్డుపై అందించే ఈ కుటుంబ డిజిటల్ కార్డు కోసం అధికారులు ఇంటింటికీ వెళ్లి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. ఆధార్ కార్డు ప్రామాణికంగా కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, రేషన్‌కార్డు లేని వారి వివరాలు సేకరించారు. అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించేందుకు ఒక్కో నియోజకవర్గంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ సర్వే చేపట్టారు. సర్వే నివేదికను కమిషనర్‌కు అందజేసినట్లు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు, ఏఎంసీలు ఎస్వై కమల్, బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది సర్వే నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

## పందెన్ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయండి..

మణికొండ, అక్టోబర్ 14: బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సోమవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్ మహ్మద్ మాట్లాడుతూ.. పందెన్ వాగుపై తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయని దాంతో స్పెక్ట్రమ్ విల్లాస్ వాసులతోపాటు చుట్టు పక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంకటేశ్వర కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద పనులు పూర్తి కాకపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు. వెంటనే అధికారులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. జాయింట్ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, నర్సింహులు, సందీప్, జస్వంత్ పాల్గొన్నారు.

## రైల్లోంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, అక్టోబర్ 14: రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్-లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైల్లోంచి జారి కింద పడడంతో రెండు కాళ్లు పూర్తిగా తెగిపోయాయి. దీంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయసు సుమారు 25-30 ఏండ్లు ఉంటాయని, ఒంటిపై తెలుపు, నలుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## అవినీతిపై పోరాటం

ఉప్పల్, అక్టోబర్ 14: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్ జీఎం డా.సీహెచ్.విశ్వనాథం మాట్లాడుతూ దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి అవరోధంగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు. కళాశాలప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్, ఎజీఎం ప్రకాశ్ రావు, విజిలెన్స్ అధికారి రూత్ బెక్కం, ఫణిమాధూరి, రమేశ్‌బాబు, కళాశాల అధ్యాపకులు పి.విజయ్‌కుమార్, విశ్వనాథ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డా.రవిప్రసాద్, డా.రాజశ్రీ, డా.సీహెచ్.సత్యనారాయణ, డా.జి.తిరుపతయ్య, కె.గీత, ఎస్.యు మన, డా.వి.శ్రీనివాస్‌రావు, డా.ఆర్.చంద్రసాగర్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

బండ్లగూడ: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సర్కిల్ డీసీ రవికుమార్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి నిర్వహించారు. రెండు వినతులు రావడంతో వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదేశించారు.